క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

వత్సవాయి: వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యకర్తల సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొంటారని చెప్పారు. కావున పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

అమ్మవారి సేవలో బుల్లితెర నటులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని శనివారం బుల్లితెర నటులు దర్శించుకుని పూజలు చేశారు. బుల్లితెర నటుడు సిద్ధార్థ వర్మ, విష్ణుప్రియ దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎంతో విశిష్టత కలిగిన అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని సిద్ధార్థ వర్మ దంపతులు తెలిపారు.

రెండు ఇసుక లారీలు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శనివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తెల్లవారుజామున చిల్లకల్లు టోల్‌ప్లాజా రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమండ్రి నుంచి నల్గొండకు వెళ్తున్న రెండు లారీలను పరిశీలించి ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం లోడును రాజమండ్రిలో అన్‌లోడ్ చేసి గోదావరిలో ఇసుక లోడ్ చేసుకుని అక్రమంగా నల్గొండ తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో నల్గొండకు చెందిన యజమాని బచ్చుబోయిన యాధవయ్యతో పాటు డ్రైవర్లు దాసరి శ్రావణ్, మేడబోయిన శంకర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేశారు.

29మంది ఉద్యోగాలకు ఎంపిక



కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎఫ్తానిక్స్ ప్రైవేట్ లిమిటెట్ కంపెనీలో తమ విద్యార్థులు 29మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు బీటెక్, ఎంసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ రామ్మోహనరావు, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, పవన్‌కుమార్, పలు విభాగాల అధిపతులు విద్యార్థులను అభినందించారు.

200మందికి వైద్య పరీక్షలు



వీరులపాడు: మండలంలోని పొన్నవరం గ్రామ సమీపంలోని ఏకత్వ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు కంచికచర్ల కారుణ్య ఎమర్జెన్సీ జనరల్ హాస్పటల్ సౌజన్యంతో 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్, కంటి, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు వైద్యులు మొండ్రు సురేష్‌బాబు, కోట విజయశేఖర్, హరీష్, వీరేష్, సెంధిని పాల్గొన్నారు.
సు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దళిత బహుజన ఐక్యవేదిక నిరసన

విస్సన్నపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని బహుజన దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. స్థానిక బహుజన దళిత ఐక్య వేదిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు గొర్రె లాజరస్, సిరసాని ప్రకాష్, పల్లెపాం లక్ష్మయ్య, ముంగా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి సరే.. అప్రోచ్ రోడ్డు ఏదీ..!

- ఏడేళ్లుగా బ్రిడ్జి ఉన్నా.. ఉపయోగం లేని వైనం
- నేటికీ మొదలు కాని అప్రోచ్ రోడ్డు పనులు
- వర్షాకాలంలో కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా ఏరు



నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద అప్రోచ్ రోడ్డు లేక ఉపయోగంలోకి రాని బ్రిడ్జి

కంచికచర్ల: రెండు తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించడానికి వైరా, కట్టలేరుపై గతంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అయితే బ్రిడ్జి నిర్మాణం జరిగి ఏడేళ్లు దాటినా.. వినియోగించుకునే అదృష్టానికి మాత్రం ప్రజలు నోచుకోలేదు. దీంతో వర్షాలు, వరదలు వచ్చిన ప్రతిసారీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఈ రహదారిపై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామం నుంచి జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలం వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు బీటీ రోడ్డు వేశారు. ఇదే రోడ్డు మార్గాన నందిగామ, వీరులపాడు మండలాల మధ్య సంగమేశ్వరస్వామి ఆలయం కూడలి వద్ద వైరా, కట్టలేరు వాగులపై కాజ్‌వే నిర్మించారు. వర్షాకాలంలో ఆ కాజ్‌వే పైకి నీరు చేరిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో కట్టలేరు వైరా ఉప నదులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వారం రోజుల పాటు రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు రాష్ట్రాల ప్రజలు ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.



ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

వరదొస్తే రాకపోకలు బంద్

నందిగామ మండలంలోని దాములూరు, వీరులపాడు మండలంలోని పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా, కట్టిలేరు సంగమ ప్రాంతం ఉంది. ఉప నదులను దాటేందుకు దశాబ్దాల క్రితం కాజ్‌వే నిర్మించారు. రాను రాను ప్రజలు, ప్రయాణికుల అవసరాలు పెరుగుతుండటంతో రాకపోకలు సైతం గణనీయంగా పెరిగాయి. దీనికితోడు ఖమ్మం జిల్లాకు వీరులపాడు మండలం బోర్డర్‌గా ఉండటంతో తెలంగాణ వైపు నుంచి వీరులపాడు మండలానికి, నందిగామ మండలానికి వచ్చే వారు ఈ మార్గాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తారు. వర్షాకాలంలో ఎగువన తెలంగాణలో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వైరా, కట్టిలేరు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ఇక సంగమ ప్రాంతం కావడంతో ఇక్కడ వరద ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ సమయంలో రోడ్డు దాటేందుకు సాహసించిన పలువురు వరద ఉధృతికి కొట్టుకుపోయారు. పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అనేక మంది తీవ్రంగా గాయపడి జాలర్ల సాయంతో బయటపడ్డారు. ఒకసారి ఏకంగా ఆర్టీసీ బస్సు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అదృష్టవశాత్తూ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

అప్రోజ్ రోడ్డు వేయరా..?

ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మించేందుకు 2015లో ప్రభుత్వం రూ.6.47 కోట్లు మంజూరు చేసింది. 2016లో నిర్మాణ పనులు ప్రారంభించి, 2017లో పూర్తి చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఏడేళ్లుగా ఈ బ్రిడ్జిని ఉపయోగించుకునే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. కోట్లు వెచ్చించి నిర్మించిన బ్రిడ్జి కళ్లెదుటే కనిపిస్తున్నా.. దశాబ్దాల క్రితం నిర్మించిన కాజువేను ఆశ్రయించక తప్పని పరిస్థితి. కోట్లాది రూపాయలతో బ్రిడ్జి నిర్మించి కేవలం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయలేక అప్పటి పాలకులు చేతులెత్తేశారు. అటు పల్లెంపల్లి వైపు, ఇటు దాములూరు వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదు. ఇందుకోసం రైతుల వద్ద నుంచి భూమిని సేకరించారు. అయితే సదరు భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం కూడా సక్రమంగా చెల్లించలేదు.

వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వే

ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాలకు కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాజ్‌వేకు ఏర్పాటు చేసిన బండరాళ్లు లేచిపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో ఆ గోతుల్లో పడి తీవ్రగాయాల పాలవుతున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాజ్‌వేపై ఉన్న గోతుల్లో నీరు చేరి కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయితే అధికారులు తూతూమంత్రంగా కాజ్‌వేపై మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



దాములూరు కూడలి బ్రిడ్జి నిర్మించారు కాని అప్రోచ్ రోడ్డు వేయలేదు. వర్షాకాలంలో కాజ్‌వేపై ప్రయాణించాల్సి వస్తోంది. ఎక్కువ వరద నీరు వచ్చినప్పుడు వైరా, కట్టలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అప్రోచ్ రోడ్డు వేయాలి.

కేవీ కృష్ణారావు, కంచికచర్ల

అప్రోచ్ రోడ్డు వేయాలి



కొన్నేళ్ల క్రితం పవిత్ర సంగమం కూడలి వద్ద వైరా కట్టలేరుపై ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం చేసింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు ఆ బ్రిడ్జికి రెండు వైపులా అప్రోచ్ రోడ్డు వేయలేదు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

కోట కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి, వీరులపాడు మండలం

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ



నందిగామ టౌన్: వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. అంతేకాకుండా తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతుల కల్పనలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి అందుతున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

మైలవరం: మైలవరంలోని మద్యం షాపుల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ములకల చెరువు కల్తీ మద్యం మూలాలు ఇబ్రహీంపట్నంలో దొరికిన నేపథ్యంలో మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాలు ముఖ్యంగా జి.కొండూరు మండలంలోని కవులూరు, కట్టుబడిపాలెం, చెరువు మాధవరం తదితర గ్రామాలు, తెలంగాణ సరిహద్దులోని మొరుసుమల్లి, పుల్లూరు, గంగినేని వంటి గ్రామాల్లో వెహికల్ చెక్, అనధికార మద్యం విక్రయాలు, వైన్ షాపుల్లో తనిఖీలు చేపట్టామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మైలవరంలోని మద్యం షాపుల్లో స్టాక్స్ తనిఖీ చేపట్టారు. కల్తీ మద్యంపై ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



కోటి సంతకాల సేకరణలో తన్నీరు, పార్టీ నాయకులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ పేరుతో పేదలకు దూరం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని డేరంగుల పంక్షన్ హాల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే కూటమి వాటిని పూర్తిచేయలేక పీపీపీ విధానమంటూ ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని భవిష్యత్తులో వారు వైద్య విద్యకు దూరం కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో మేధావులు కూడా పీపీపీ విధానంపై ఆలోచన చేసి ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టాలని కోరారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఆళ్ల చెల్లారావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ, పార్టీ మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, ఎస్సీ సెల్ కార్యదర్శి కన్నమాల శ్యామ్యూల్, జెడ్పీటీసీ సభ్యుడు వూట్ల నాగమణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత విజిత, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కాటేపల్లి రవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాలేటి లక్ష్మణరావు, పెనుగంచిప్రోలు అధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, కనకపుడి భాస్కరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా మందా

కంచికచర్ల: స్థానిక ఏపీఎస్టీటీస్ సంఘ భవన కార్యాలయంలో శనివారం రాష్ట్రోపాధ్యాయ(ఎస్టీయూ) మండల శాఖ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగిందని మండల మాజీ అధ్యక్షుడు నండ్రు సురేష్ బాబు తెలిపారు. అనంతరం మండలశాఖ ఎన్నికలు సయ్యద్ మౌలాలి పర్యవేక్షణలో జరిగాయి. నూతన మండల శాఖ అధ్యక్షుడిగా మందా సుధాకర్(ఎంపీపీ స్కూల్ పేరకలపాడు), ప్రధాన కార్యదర్శిగా మల్లారపు రాధాకృష్ణ(జెడ్పీ స్కూల్, కంచికచర్ల), ఆర్థిక కార్యదర్శిగా మహ్మద్ గౌస్(ఎంపీపీ స్కూల్, మోగులూరు), మండల మహిళా కన్వీనర్‌గా కెజియా రాణి(ఎంపీపీ స్కూల్, కంచికచర్ల)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య, స్టేట్ కౌన్సిలర్ అక్కల అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శేషం గోపాలరావు, మాజీ కార్యదర్శి బళ్లా రవికుమార్, జిల్లా మైనార్టీ కన్వీనర్ షేక్ ఇస్మాయేల్, జిల్లా కార్యదర్శి శేషం వెంకట్రావు, సంఘ నాయకులు అమర్లపూడి జేమ్స్, మాదుగుల వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు నూతన కార్యవర్గం ఎన్నిక

వీరులపాడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయూ పని చేస్తుందని జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షయ్య పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు మెయిన్ పాఠశాల ఆవరణలో శనివారం ఎస్టీయూ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా బాణావత్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా జెర్రిపోతుల శ్రీరామ్మూర్తి, ఆర్థిక కార్యదర్శిగా మద్దాల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. ఎస్టీయూ నాయకులు కోదాటి వెంకటేశ్వరరావు, సయ్యద్ మౌలాలి, బాణావత్ శ్రీనివాసరావు, ఇమామ్ సాహెబ్, సత్యనారాయణ, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



చందర్లపాడు సోషల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాదరావు

నందిగామ రూరల్: వసతిగృహం పరిసరాలను, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ప్రసాదరావు సూచించారు. చందర్లపాడు సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ముఖ్యంగా వసతి గృహాల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాలని చెప్పారు. వసతి గృహంలోని ఒక మరుగుదొడ్డి పని చేయడం లేదని త్వరితగతిన మరమ్మతులు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కేవీకే కోఆర్డినేటర్ రవికిషోర్ పేర్కొన్నారు. గ్రామంలోని కేవీకేలో పీఎం ధనధాన్య యోజన ప్రారంభంపై ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని రైతులతో కలిసి శనివారం ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ఎంతో ప్రోత్సహిస్తోందన్నారు. పీఎం ధన ధాన్య యోజన కార్యక్రమంలో పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రైతులు అధునాతన పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, నందిగామ ఏడీఏ శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు జశ్వంత్‌రెడ్డి, శివప్రసాద్, వెంకటరెడ్డి, రాజశేఖర్, లక్ష్మీకళ, ప్రభావతి, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్

మెప్మా బ్రోచర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ పాకెట్ బ్రోచర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం ఆవిష్కరించి ఆర్పీలకు, డీజీ లక్ష్మీకి అందజేశారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఒక ఫ్యామిలీ – ఒక వ్యాపారవేత్త నినాదం కింద ప్రజలకు 47 రకాల వ్యాపార యూనిట్లు ఏర్పాటుచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సదావకాశాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నజీమున్, మెప్మా ఇన్‌చార్జ్ సీఎంఎం వెంకట్, సీవో ప్రసాద్, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా రోడ్లపై గుంతలు పూడ్చివేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త లంకపల్లి రవిప్రసాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై గుంతలను తానే సొంతగా సిమెంట్, కంకర, ఇసుక తీసుకురావడంతో పాటు మేస్త్రిని కూడా తీసుకువచ్చి పూడ్చివేయించారు. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండటంతో విద్యార్థులు, వృద్ధులు, వైద్యం కోసం వచ్చే గర్భిణులు అనేక పర్యాయాలు ఈ గుంతల్లో పడిపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోని ప్రధాన రహదార్లపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని రవిప్రసాద్ కోరాడు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజల కోసం తనకు చేతనైన సాయం చేస్తున్న లంకపల్లి రవిప్రసాద్‌ను పలువురు అభినందిస్తున్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

మక్కపేట(వత్సవాయి): ఆహారపు అలవాట్లతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.ప్రసూన తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల గుంటూరు లాంఫాం విద్యార్థులు వారం రోజులుపాటు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్యాధికారి ఎస్.అనిల్‌కుమార్ బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ అనిల్ మాట్లాడుతూ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పిల్లలకు బెల్లంతో తయారు చేసిన అల్పాహారాన్ని ఇంట్లోనే తయారు చేసి అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రెవెన్యూ అసోసియేషన్ నూతన ప్యానల్



నూతన ప్యానల్ సభ్యులు

నందిగామ రూరల్: రెవెన్యూ అసోసియేషన్ నందిగామ డివిజన్ యూనిట్ ఎన్నికలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 12 మందితో కూడిన ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి షేక్ హుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సురేష్‌బాబు, కార్యదర్శిగా మానస, కోశాధికారిగా సంధ్యారాణి, వైస్ ప్రెసిడెంట్‌లుగా రామ్మూర్తి రెడ్డి, శ్రీరామకృష్ణ, వేణు కుమారి, సంయుక్త కార్యదర్శులుగా శివప్రసాద్, వీరమ్మ, దావీదు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాజ్యలక్ష్మి, జనార్ధనరావు ఎన్నికైనట్లు వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయనున్నట్లు నూతన ప్యానల్ సభ్యులు పేర్కొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు



పల్లంపల్లి వద్ద కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వైరా కట్టలేరు

వీరులపాడు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న భారీ వరద కారణంగా వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని పల్లంపల్లి వద్ద వైరా కట్టలేరు వరద ప్రవాహాన్ని తహసీల్దార్ రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజ్‌వే పై నుంచి వరద నీరు ప్రవహిస్తోందని, ముందు జాగ్రత్తగా వీరులపాడు – నందిగామ మండలాల మధ్య రాకపోకలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. రాకపోకలు సాగించకుండా వైరా కట్టలేరు వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని కాపలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.